క్లుప్తంగా

ఘనంగా ముక్కుళ్లమ్మ వార్షికోత్సవం



ప్రత్యేక పుష్పాలంకరణలో ముక్కుళ్లమ్మ వారు

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెం– వేలివెన్ను సరిహద్దు పొలాల్లో వెలసిన వేలివెన్ను గ్రామదేవత ముక్కుళ్లమ్మ వారి వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం నిర్వహించిన భారీ అన్నసమారాధనకు పరిసర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలి వచ్చి అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


చిలకపాడు నుంచి రోడ్ల నిర్మాణం



చిలకపాడులో నిర్మిస్తున్న బీటీ రోడ్డు

ఉండ్రాజవరం: మండలంలోని చిలకపాడు నుంచి వేలివెన్ను మెయిన్ రోడ్డు వరకూ కిలోమీటరు పొడవున, అలాగే చిలకపాడు నుంచి సత్యవాడ వరకూ రెండు కిలోమీటర్ల పొడవునా చేపట్టిన బీటీ రోడ్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన కింద మంజూరైన రూ.76 లక్షల వ్యయంతో ఈ నిర్మాణాలు చేపట్టారు. గతంలో ఈ రోడ్లు అధ్వానంగా తయారవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దాంతో సమస్యను నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడి దృష్టికి తీసుకు వెళ్లినట్టు ఆ పంచాయతీ సర్పంచ్ తిరుమళ్ల సూర్యకుమారి శనివారం తెలిపారు. ఆయన సహకారంతో ఈ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టినట్టు ఆమె తెలిపారు. ఈ పనులను వైఎస్సార్ సీపీ నాయకులు పింద్రా పోసేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు తిరుమళ్ల నాగపార్వతి పర్యవేక్షిస్తున్నారు.

నిమ్మకాయలు కిలో రూ.80



యాదవోలు మార్కెట్లో కొనుగోలు చేసిన నిమ్మకాయలు

దేవరపల్లి: నిమ్మకాయల ధర మార్కెట్లో రోజు రోజుకూ పెరుగుతోంది. మూడు రోజులుగా ధర స్వల్పంగా పెరుగుతూ వస్తోంది. ఆదివారం మండలంలోని యాదవోలు మార్కెట్లో కిలో నిమ్మకాయలు రూ.80 రేటు పలికినట్టు రైతులు తెలిపారు. గత వారం కిలో రూ.70 ఉండగా, ప్రస్తుతం రూ.10 పెరిగినట్టు వివరించారు. అయితే తోటల్లో ముదర కాయలు లేకపోవడంతో రైతులు లేత కాయలు కోసి మార్కెట్‌కు తీసుకురావడం వల్ల ధర స్వల్పంగా పెరుగుతోందని వ్యాపారులు అంటున్నారు.

గండిపోశమ్మను దర్శించుకున్న హోం మంత్రి



గండిపోశమ్మవారిని దర్శించుకుంటున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: కుమారదేవం గ్రామంలో గోదావరి ఒడ్డునే కొలువైన గండిపోశమ్మ వారిని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత సోమవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు మంత్రికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకుడు బొల్లిన సతీష్ ఏర్పాటు చేసిన విందుకు నాయకులతో కలిసి హాజరయ్యారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, వైఎస్సార్ సీపీ మండలశాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడు గన్నమని వీర వెంకటరాజు, గోలి శ్రీనివాస్, గండిపోశమ్మవారి ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ గంధం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కొవ్వూరు: పట్టణంలోని లాంచీల రేవు వద్ద ఆదివారం ఎదురెదురుగా వస్తున్న రెండు మోటార్ సైకిళ్లు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ఒక మోటార్ సైకిల్‌పై వెళుతున్న పట్టణానికి చెందిన కొయ్యల వీరభద్రం అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. లాంచీల రేవు దిగువ నుంచి బైక్‌పై వెళుతున్న వీరభద్రంను ఎదురుగా వస్తున్న మరో మోటారు సైకిల్ బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కాలికి బలమైన రక్తపు గాయమైన వీరభద్రాన్ని 108 అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. కొవ్వూరు పట్టణ పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

అన్ని స్థానాలూ గెలుచుకుందాం

- అందుకు పార్టీ శ్రేణులు కలసికట్టుగా పని చేయాలి
- కొవ్వూరులో హోం మంత్రి వనిత పిలుపు
- పండగలా వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుక
- పలుచోట్ల సేవా కార్యక్రమాలు
- సందడి చేసిన పార్టీ శ్రేణులు

కొవ్వూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలోని 175 స్థానాల్లోనూ విజయమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు పనిచేయాలని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత పిలుపునిచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు నియోజకవర్గాల్లో ఆదివారం ఆ పార్టీ శ్రేణులు పండగలా జరుపుకున్నాయి. అన్ని గ్రామాల్లోనూ పార్టీ పతాకాలను ఆవిష్కరించి, దివంగత నేత వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కేక్‌లు కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద మంత్రి వనిత ఆధ్వర్యంలో ఘనంగా ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావ సమయంలో అందరం ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొన్నామన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక జనరంజక పథకాలు అమలు చేస్తూ అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. పార్టీ శ్రేణులతో పాటు ప్రజలందరూ ఆయనకు అండగా ఉండాలని కోరారు. అనంతరం స్థానిక సీహెచ్‌సీలోని రోగులకు పండ్లు, రొట్టెలు, పాలు పంపిణీ చేశారు. వాత్సల్య వృద్ధాశ్రమంలోని వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మునిసిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి, పార్టీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, పార్టీ మండల, పట్టణ శాఖల అధ్యక్షులు సుంకర సత్యనారాయణ, రుత్తల భాస్కర రావు, చాగల్లు మండల శాఖ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు, మహిళా విభాగం అధ్యక్షురాలు ఏలూరి విజయలక్ష్మి, మండల గౌరవాధ్యక్షుడు గన్నమని వీర వెంకటరాజు, జడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, పలువురు నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలోని వివిధ గ్రామాల్లో పార్టీ శ్రేణులు వైఎస్సార్ విగ్రహాలకు పాలాభిషేకాలు చేసి, పూలమాలలు వేసి నివాళులర్పించాయి. పెద్దేవంలో పార్టీ జిల్లా కార్యదర్శి తోట రామకృష్ణ, సర్పంచ్ తిరిగిపల్లి వెంకటరావు ఆధ్వర్యంలోను, వేగేశ్వరపురంలో సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశు రామారావు, ఎంపీటీసీ సభ్యుడు రావిపాటి లక్ష్మణరావు ఆధ్వర్యంలోను, ప్రక్కిలంకలో పార్టీ నియోజకవర్గ ఎస్సీ సెల్ కన్వీనర్ యాళ్ల బాబురావు ఆధ్వర్యంలోను, గజ్జరంలో సర్పంచ్ గండి రాంబాబు, గన్నిన రత్నాజీ ఆధ్వర్యంలోను పార్టీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. అలాగే తాళ్లపూడి, అన్నదేవరపేట, పోచవరం, తిరుగుడుమెట్ట, మలకపల్లి, బల్లిపాడు, తాడిపూడి గ్రామాల్లోను పార్టీ పతాకాలను ఎగుర వేశారు.



కొవ్వూరు వాత్సల్య వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న హోం మంత్రి తానేటి వనిత

చాగల్లు: బ్రాహ్మణగూడెంలో వైఎస్సార్ చిత్ర పటానికి పార్టీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య పూలమాల వేసి నివాళులు అర్పించారు. పార్టీ పతాకాన్ని ఆవిష్కరించాక, కేక్ కట్ చేశారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ ప్రత్తిపాటి సుబ్బారావు, పార్టీ నాయకుడు, ఆత్కూరి శ్రీనివాస్, పొన్నాడ సింహాద్రి, మూల వెంకటరమణ, ఎల్లే వెంకట్రావు కార్యకర్తలు పాల్గొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో పార్టీ ఆవిర్భావ దినోత్సవాలను నిర్వహించారు.

నిడదవోలు రూరల్: పేదల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించిందని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలోను, తాడిమళ్ల గ్రామంలోను వైఎస్సార్ విగ్రహాల వద్ద ఆ పార్టీ అవిర్భావ దినోత్సవాన్ని వేర్వేరుగా నిర్వహించారు. తాడిమళ్లలో పార్టీ పతాకాన్ని పార్టీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్మన్ వెలగన పోలయ్య, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పెరవలి: మండలంలోని ఉసులుమర్రు గ్రామంలో పార్టీ పతాకాన్ని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దేశంలోనే ఒకటో స్థానంలో ఉందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు.అది చూసి ప్రతిపక్ష నేత చంద్రబాబుకు నిద్రపట్టక ప్రభుత్వంపై అపనిందలు వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజని, వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



దేవరపల్లిలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి, వైఎస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తలారి

ఉండ్రాజవరం: వేలివెన్ను గ్రామంలో వైఎస్సార్ సీపీ నేతలు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి, వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కర రామయ్య, ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, వైస్ ఎంపీపీలు ఎన్.సరోజ, చెట్టే నవీన్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నాయి.

దేవరపల్లి: దేవరపల్లిలోని తన క్యాంపు కార్యాలయం వద్ద గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మహానేత వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు.ఎమ్మెల్యే తన ప్రసంగంలో గత మూడున్నరేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, పేదలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, మహిళలకు ఎమ్మెల్యే వెంకట్రావు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కూచిపూడి సతీష్, ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దన రావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి నరహరిశెట్టి రాజేంద్ర బాబు, నియోజకవర్గ మహిళా కన్వీనర్ గారపాటి రమాప్రభ, మండల మహిళా కన్వీనర్ కడలి హైమావతి, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, సర్పంచ్ కడిమి వీరకుమారి, మండల సేవాదళ్ చైర్మన్ మాధవరపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: గోపాలపురం సొసైటీ చైర్మన్ కూసం రామమోహన్‌రెడ్డి నివాసం వద్ద ఎమ్మెల్యే తలారి వెంకట్రావు దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి, కేక్ కట్ చేసి పార్టీ నాయకులకు మిఠాయిలు పంపిణీ చేశారు. స్థానిక ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు పోతిరెడ్డి నాగరాజు, ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, వైఎస్సార్ సీపీ మండల మాజీ అధ్యక్షుడు ఎస్‌కే వల్లీ, రాష్ట్ర క్రీడల డైరెక్టర్ కప్పల వరలక్ష్మి, పలువురు పార్టీ నాయకులు, సర్పంచులు,ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

నల్లజర్ల: నల్లజర్లలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం ఇంటి వద్ద వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. వైఎస్సార్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, కారుమంచి రమేష్, కండెపు రామకృష్ణ,నూతికుర్తి లక్ష్మణరావు, ముప్పిడి వెంకటరత్నం, వామిశెట్టి పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నిడదవోలులో వైఎస్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ



వేలివెన్నులో వైఎస్సార్ చిత్రపటానికి వైఎస్సార్ సీపీ శ్రేణుల నివాళి

పేద విద్యార్థులకు ప్రైవేట్ విద్య

- ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో 1వ తరగతి నుంచి ఉచిత విద్య
- విద్యాహక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్ల కేటాయింపు
- ఈ నెల 18 నుంచి ఏప్రిల్ 7 వరకూ దరఖాస్తుల స్వీకరణ
- లాటరీ పద్ధతిలో విద్యార్థుల ఎంపిక
- అమ్మఒడి కింద స్కూళ్లకు ఫీజు చెల్లింపు

నిడదవోలు రూరల్: విద్యావ్యవస్థలో తీసుకున్న కొన్ని కీలక నిర్ణయాలు ఇప్పటి వరకూ కేవలం కాగితాలకే పరిమితం అయ్యాయి. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం నిక్కచ్చిగా అలాంటి నిర్ణయాలను ఆచరణలో పెట్టి పేద విద్యార్థులు కూడా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఉచితంగా విద్య అభ్యసించేలా చర్యలు చేపట్టింది. బాలల ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో 25 శాతం సీట్లను పేదలకు కేటాయించాలి. దీనిపై 2009 ఆగస్టు 27న కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటికీ నేటి వరకూ ఏ ప్రభుత్వం కూడా ఈ ఆదేశాలను అమలు చేయడం లేదు. అయితే 2023–24 విద్యా సంవత్సరం నుంచి ఈ నెల 18 నుంచి ఒకటో తరగతిలో ప్రవేశాలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. దీంతో తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చదివించాలనే పేద తల్లిదండ్రుల ఆశలు నెరవేరనున్నాయి. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రభుత్వ గుర్తింపు ఉన్న ప్రైవేట్ స్కూళ్ల ఒకటో తరగతిలో 25 శాతం సీట్లను పేద పిల్లలకు కేటాయించాలి. నిడదవోలు నియోజకవర్గంలోని నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం మండలాల్లో 79 ప్రైవేటు, 6 కార్పొరేట్ పాఠశాలలు ఉన్నాయి.



నిడదవోలు జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులు

సీట్ల కేటాయింపు, ఫీజుల చెల్లింపు ఇలా...

ప్రతి ప్రైవేట్ పాఠశాలలో అనాథ, దివ్యాంగ, హెచ్ఐవీ బాధితుల పిల్లలకు 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బలహీన వర్గాల పిల్లలకు 6 శాతం మొత్తం 25 శాతం సీట్లను ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు కేటాయించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు 6–14 మధ్య వయసు పిల్లల తల్లిదండ్రుల వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.44 లక్షల లోపు ఉండాలి. అర్బన్ పరిధిలోని పాఠశాలలో ఒక్కో అడ్మిషన్‌కు రూ.8 వేలు, రూరల్ పరిధిలోని అడ్మిషన్‌కు రూ.6,500 గా నిర్ణయించింది. ఈ మొత్తాన్ని ప్రభుత్వమే ఆయా పాఠశాలలకు చెల్లిస్తుంది. అయితే మన రాష్ట్రంలో అమ్మఒడి పథకం ద్వారా ఏటా ఒక్కో విద్యార్థి తల్లి బ్యాంకు ఖాతాకు రూ.15 వేల చొప్పున ప్రభుత్వం అందజేస్తుంది. ప్రైవేట్ పాఠశాలలకు ఎంపికైన విద్యార్థులకు అమ్మఒడి డబ్బుతోనే ఫీజు చెల్లిస్తారు. మిగిలిన సొమ్మును, విద్యార్థి తల్లి లేదా సంరక్షకుల ఖాతాలో జమ చేస్తారు. ఇందుకు సంబంధించిన విధి విధానాలను ప్రభుత్వం ప్రకటించింది.

ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్..

ఈనెల 16 వరకూ ప్రైవేట్ స్కూళ్ల వెబ్ సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఈనెల 18 నుంచి ఏప్రిల్ 7 వరకు అర్హులైన విద్యార్థులు తమ పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. ఏప్రిల్ 9 నుంచి 12 వరకూ సచివాలయాల్లో ఉన్న డేటా ద్వారా అర్హులైన విద్యార్థులను గుర్తిస్తారు. ఏప్రిల్ 13న లాటరీ ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తారు. అదే నెల 15 నుంచి 21 వరకూ ఆయా స్కూళ్లకు విద్యార్థుల అడ్మిషన్‌లను ఖరారు చేస్తారు. మిగులు సీట్లకు ఏప్రిల్ 25న రెండోసారి లాటరీ నిర్వహించి, 26 నుంచి 30 వరకూ అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేస్తారు.

పేద విద్యార్థులకు ఉన్నత చదువులు



విద్యాహక్కు చట్టంలో భాగంగా ప్రైవేట్ స్కూళ్లలోని 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయిస్తూ సీఎం జగనన్న తీసుకున్న నిర్ణయం హర్షణీయం. పేద విద్యార్థుల ఉన్నత చదువులకు బాటలు వేశారు. ఇప్పటికే విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకు రావడంతో పాటు నాడు–నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలల రూపు రేఖలు మార్చారు.

– మానుకొండ చంద్రబాబు, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు, తాడిమళ్ల

రానున్న విద్యా సంవత్సరం నుంచే అమలు



2023–24 విద్యా సంవత్సరం నుంచే ప్రైవేట్ స్కూళ్లలో 25 శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయిస్తారు. దీనిపై ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లకు అవగాహన కల్పించాం. ప్రభుత్వం నిర్ణయించిన గడువులోగా ప్రతి పాఠశాల పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. పేద విద్యార్థులకు ఇది ఒక మంచి అవకాశం. వారి చదువు ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది.

– డి.కిషోర్, ఎంఈఓ, నిడదవోలు

జగన్నాథపురం- సంజీవపురం రోడ్డుకు మోక్షం

స్పందించిన గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ సంస్థ




జగన్నాథపురం -సంజీవపురం రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

గోపాలపురం: మండలంలోని జగన్నాథపురం– సంజీవపురం గ్రామాల మధ్య దెబ్బతిన్న రోడ్డుకు గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ సంస్థ అధికారులు ఆదివారం మరమ్మతులు చేపట్టారు. సమీపంలో గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం వల్ల తమ రోడ్డు అధ్వానంగా తయారైందంటూ 20 రోజుల క్రితం ఈ రెండు గ్రామాల ప్రజలు ఇక్కడి క్వారీ వద్ద నిరసన తెలిపారు. దీనికి స్పందించిన గ్రీన్ ఫీల్డ్ సంస్థ అధికారులు స్పందించి ఆదివారం రోడ్డు మరమ్మతుకు శ్రీకారం చుట్టారు. సుమారు ఐదు కిలోమీటర్ల రోడ్డు మరమ్మతులకు రూ 50 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు గ్రీన్‌ఫీల్డ్ హైవే అధికారి ఎస్.రమేష్ బాబు తెలిపారు. పనులు చేపట్టడంతో రెండు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.


ఇద్దరు యువకుల దుర్మరణం

చాగల్లు: బ్రాహ్మణగూడెం శివారులో గరప్పాడు సమీపంలో ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. లారీ ఢీకొన్న ఘటనలో మోటార్‌సైకిల్‌పై వెళుతున్న ఇద్దరు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. చాగల్లు మండలం నందిగంపాడుకు చెందిన పెదమర్తి కర్నేలు, కొవ్వూరు మండలం మద్దూరుకు చెందిన భరత్, కె.ఆనంద్‌కుమార్ బైక్‌పై నిడదవోలు నుంచి నందిగంపాడు వెళుతున్నారు. వారిని లారీ ఢీకొట్టడంతో కర్నేలు, భరత్ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన ఆనంద్‌కుమార్‌ను అత్యవసర వైద్యం కోసం నిడదవోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని ప్రమాదవివరాలు సేకరిస్తున్నారు.

బెల్లం ధరతో చెరకు రైతుకు ఊరట



నడుపల్లిలో చెరకు తోట నరుకుతున్న కూలీలు



బెల్లం తయారీలో నిమగ్నమైన కూలీ

పెరవలి: చెరకు దిగుబడి తగ్గింది. అయితే మార్కెట్లో బెల్లానికి గిట్టుబాటు ధర లభించడంతో స్వల్ప మిగులుతో రైతులు గట్టెక్కుతున్నారు. లోగడ ఎన్నడూ లేని విధంగా మార్కెట్‌లో 10 కిలోల బెల్లానికి రూ.440 రేటు లభిస్తోంది. తుపానులు, వరదలు, అధిక వర్షాల వలన ఈ ఏడాది తోటలు కొంతమేర దెబ్బతిన్నాయి. ఫలితంగా చెరకు దిగుబడి అనూహ్యంగా తగ్గిపోయింది. చెరకు దిగుబడి ఎక్కువగా ఉంటే మరింతగా లాభాలు వచ్చేవని చెరకు సాగుదారులు చెబుతున్నారు. సాధారణంగా ఎకరం విస్తీర్ణంలోని చెరకు నుంచి 4840 కిలోల బెల్లం దిగుబడి రావాలి. అయితే కేవలం మూడు వేల నుంచి 3,400 కిలోల బెల్లం మాత్రమే వస్తోంది.

పెట్టుబడి, ఆదాయం ఎంత

చెరకు సాగుకు ఎకరానికి పెట్టుబడి రూ.50 వేల వరకు అవుతుంది. అయితే చెరకు నరకడానికి, బెల్లం తయారీకి అవసరమైన పిప్పి, చెరకు తుక్కు, బెల్లం తయారీ కూలీలు, క్రషర్‌లో చెరకును ఆడేందుకు కూలీల ఖర్చుకు మరో రూ.45 వేలు అవుతుంది. ఒక వేళ కౌలుదారులైతే రూ.30 వేల నుంచి రూ.35 వేలు అదనంగా ఖర్చవుతుంది. కౌలు రైతులు ఎకరం విస్తీర్ణంలో చెరకు పండించి, బెల్లం తయారు చేయించడానికి రూ.1.30 లక్షలు ఖర్చవుతుంది. ఎకరం విస్తీర్ణంలోని చెరకు ద్వారా 3 వేల కిలోల బెల్లం దిగుబడి వస్తే రూ.1.32 లక్షల ఆదాయం వస్తుంది. అదే 3,400 కిలోల బెల్లం దిగుబడి వస్తే రూ.1.50 లక్షలు, 4వేల కిలోల దిగుబడి వస్తే రూ.1.76 లక్షలు ఆదాయం వస్తుంది. గతేడాది ఇదే సమయంలో 10 కిలోల బెల్లం ధర రూ.420 ఉంది. నిడదవోలు నియోజకవర్గంలో సుమారు 1500 ఎకరాల్లో చెరకు సాగుతుతుంది. మండలాలవారీగా నిడదవోలులో 900 ఎకరాలు, ఉండ్రాజవరంలో 400 ఎకరాలు, పెరవలిలో 200 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

‘మానవత’ ను మరింతగా విస్తరించాలి



గోపాలపురంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న మానవత సంస్థ సభ్యులు

- శాశ్వత దాతల కమిటీ సభ్యుడు ‘తానింకి’
- గోపాలపురంలో రక్తదాన శిబిరం

గోపాలపురం: మానవత స్వచ్ఛంద సంస్థ సేవలను మరింత విస్తరించాలని ఆ సంస్థ శాశ్వత దాతల కమిటీ సభ్యుడు, పద్మసాయి ఫైనాన్స్ అధినేత తానింకి సత్యనారాయణ (బాబీ) అభిప్రాయపడ్డారు. మొదట్లో 108 మందితో ప్రారంభించిన ఈ సంస్థలో ప్రస్తుతం 50 వేల మంది సభ్యులు ఉండడం అభినందనీయం అన్నారు. మానవత సంస్థ మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక శర్వాణి హైస్కూల్లో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన తానింకి మాట్లాడుతూ సభ్యత్వాల సంఖ్య పెరగడం ద్వారా మరింత మందికి సాయాన్ని అందించవచ్చన్నారు. మానవత సంస్థ జిల్లా కార్యవర్గ సభ్యుడు జొన్నలగడ్డ రాంబాబు కూడా ప్రసంగించారు. ఆ సంస్థ మండల శాఖ అధ్యక్షుడు భూరెడ్డి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ శిబిరంలో సభ్యులు ముప్పన కృపావర ప్రసాద్, బలుసు సత్యనారాయణ, దాతలు కూసం రామమోహన్‌రెడ్డి, జోడాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.